# అ.భ.సం.

**ఆ**నందరావు, భజగోవిందం ఇంటి వరండాలో కూర్చుని ఉన్నాడు. చేతిలో ఉన్న లెదర్‌బ్యాగ్‌లోంచి కాయితాలు తీశాడు. సుఖసంతోషా రియల్ ఎస్టేట్ వారి వివరాలు అవన్నీ.

పేరులో తప్ప జీవితంలో అంతగా ఆనందంలేని ఆనందరావు వయసు అరవై జీవితంలో పూర్తిగా స్థిరపడిన తరువాత వివాహం చేసుకొందాం అని ఆలస్యంగా పెళ్లిచేసుకోవడంవల్ల రిటైరు అయినా భాధ్యతలు తీరలేదు. మళ్లీ ఉద్యోగం చెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సుఖసంతోషా వారు పేపర్లో ప్రకటన ఇస్తే అప్లయ్ చేశాడు. ఏరియా మేనేజరుగా ఉద్యోగం దొరికింది. నెలకు వెయ్యిరూపాయల జీతం. ఆపైన కమీషన్. బాగానే వుందని చేరిపోయాడు. మంచిరోజు చూసుకుని పని ప్రారంభించాడు. ఓం ప్రథమంగా భజగోవిందం ఇంటికే వచ్చాడు.

పూజ ముగించి బయటికి వచ్చాడు భజగోవిందం. భారీ విగ్రహం. చిరునవ్వులు చిందిస్తూ వచ్చాడు. లేచి నిలబడి నమస్కారం చేసి తనను తాను పరిచయం చేసుకున్నాడు ఆనందరావు.

"అలాగా చాలా సంతోషం మీ వివరాలు చెప్పండి" అన్నాడు భజగోవిందం.

ఆనందరావుకి చెప్పలేనంత ఆనందం కలిగింది. "ఇళ్ల స్థలాలా! వద్దులెండి. మాకు ఆల్రెడీ రెండు స్థలాలున్నాయి" అంటారు అందరూ సామాన్యంగా అందుకు భిన్నంగా జరగడం శుభసూచకంగా అనిపించింది అతనికి. వివరాలు చెప్పనారంభించాడు.

"మా సుఖసంతోషా వారు నలభై ఎకరాల స్థలం కొని ప్లాట్లుగా విభజించారు. స్థలం విషయంలో ఏ విధమైన పేచీలు లేవు. క్లియర్ టైటిల్స్. సిటీ సెంటర్ నుంచి

కేవలం నలభైఎనిమిది కిలోమీటర్ల దూరం. ఇక్కడనుంచి వెళ్లే అన్ని హైటెక్ బస్సులూ మన కాలనీ మీదుగానే వెళ్తాయి" అన్నాడు.

"అలాగా? మరైతే ఇకనేం? ట్రాన్స్‌పోర్టు ప్రాబ్లం లేదు" అన్నాడు భజగోవిందం. మీదుగా వెళ్తాయి సరే అక్కడ ఆగుతాయా? అని అతను అడగనందుకు లోలోపలే సంతోషించాడు ఆనందరావు.

"ఇకపోతే ఒక్కో ప్లాటు 333 చదరపు గజాలు. అందరూ మూడొందల గజాలు మాత్రమే అంటారు కానీ మేము ఆ ధరకే మరో 33 చదరపు గజాలు అదనంగా ఇస్తున్నాం" చెప్పాడు.

–"వెరీగుడ్!" మెచ్చుకున్నాడు భజగోవిందం.

"రియల్ ఎస్టేట్ వాళ్ళు మామూలుగా, మామిడి, జామ మొక్కలు వేస్తాం అంటున్నారు. ఎందుకా పనికిరాని మొక్కలు? సీజన్‌లో పదిరూపాయలు పెడితే కావలసినన్ని పళ్లు, మేము వెయ్యబోయే మొక్కల గురించి చెప్తే మీరు ఆశ్చర్యపోతారు" సస్పెన్స్ రైటర్‌లా సగంలో ఆపేశాడు ఆనందరావు.

"ఏమిటవీ?"

"వెదురు, మల్బరీ, రెండు కాఫీ మొక్కలు, రెండు టీ మొక్కలు, ప్రతి ఇంట్లోనూ పెంచుతాం. మీరే ఆలోచించి చూడండి. ఇప్పుడు లాంగివిటీ పెరిగిపోయిన కారణంగా వృద్ధులూ, నిరుద్యోగసమస్య వలన నిరుద్యోగులూ ప్రతి ఇంట్లోనూ ఉంటూనే ఉన్నారు. వెదురు వేశామనుకోండి. ఇల్లు కట్టుకునే వేళకి చకచకా పెరిగిపోతుంది.

"మంచి ముహూర్తం చూసి మల్బరీ కూడా వేశామంటే ఈ వెదురుతో బుట్టలు అల్లి కాసిని పట్టు పురుగులు కొనుక్కుని స్వయం ఉపాధి కల్పించుకోవచ్చు" అంటూ ఆపేశాడు ఆనందరావు.

"ఓహ్ బ్రహ్మాండం – భేషుగ్గా ఉంది" మెచ్చుకున్నాడు భజగోవిందం.

"ఇకపోతే కాఫీ టీల ధరలు చుక్కలంటుతున్నాయి. మధ్యతరగతి వారింట్లో భోజనానికి ఎంత ఖర్చవుతోందో కాఫీ టీలకు అంతే అవుతోంది. ఎంచక్కా కాఫీ మొక్కా టీ మొక్కా మనింట్లోనే ఉంటే నాలుగు గింజలు వేయించుకుని కాఫీ పెట్టుకోవచ్చు. గుప్పెడాకులు కోసి టీ పెట్టుకోవచ్చు" వివరించాడు.

"చాలా బావుంది మీ ఆలోచన. అక్కడ ఇల్లు కట్టుకుంటే చీకూచింతా ఉండదు" అన్నాడు భజగోవిందం ఆనందంగా. "మరందుకే కదండీ మా వెంచరుకీ ఏరి కోరి

సుఖసంతోషా అని పేరు పెట్టింది. ఇంకొద్ది ప్లాట్లు మాత్రమే ఉన్నాయి. మీరు తొందరపడితే మంచిది, స్వయంగా వచ్చి చూస్తా నంటే వెహికల్ అరేంజ్ చేస్తాను" అన్నాడు ఆనందరావు.

"అలాగే చూద్దాం. మా కొలీగ్ ఒకతను ఉన్నాడు. అతనికీ ఇవన్నీ చాలా ఇంట్రెస్ట్. అతనిప్పుడు ఇక్కడికి వస్తాడు. అతనికి కూడా చెప్పి అందరం కలిసి వెళ్దాం!" అన్నాడు భజగోవిందం.

"అధికస్య అధిక ఫలం... అలాగే" అన్నాడు ఆనందరావు.

మాటల్లోనే వచ్చాడు సీతారాం!

"రండి సార్ రండి నిండా నూరేళ్లు. మీ గురించి ఇప్పుడే చెప్తున్నాను" అన్నాడు భజగోవిందం. ఆనందరావుని సీతారాంకి పరిచయం చేశాడు.

"మరి వీరు!" అన్నాడు ఆనందరావు.

"వీరి గురించి చెప్పాలంటే చాలా ఉంది. ఎంతో మంచివారు. కార్యశీలి. ఇవ్వాళ మా అ.భ.సం. ఇంత బాగా నడుస్తోంది"అంటే అదంతా వీరి గొప్పతనమే" అన్నాడు భజగోవిందం.

"భలే వారే భజగోవిందంగారూ నాదేముంది ఇదంతా మీ కృషి, పట్టుదల. మీ చేతి చలువ వల్లనే మన అ.భ.సం. దిన దిన ప్రవర్ధమానంగా నడుస్తోంది" అన్నాడు సీతారాం.

"అయ్యా ఇంతకీ అ.భ.సం. అంటే ఏమిటండీ?" బుర్రగోక్కుంటూ అయోమయంగా అడిగాడు ఆనందరావు.

అ.భ.సం. ఈ భజగోవిందంగారి ధర్మమా అని ఏర్పడిన సంస్థ. ఆ సంస్థకి ప్రసిడెంటు వీరే" అన్నాడు సీతారాం ఆరాధనగా భజగోవిందం వంక చూస్తూ.

" అలా అనకండి..ఇందులో మీరూ అత్యంత ప్రముఖులే. సెక్రట్రీ అంటే ప్రసిడెంటుని మించిన పదవి కదటండీ" అన్నాడు భజగోవిందం.

"ఇంతకి అ.భ.సం. అంటే ఏమిటో చెప్పేరు కారు" అన్నాడు దీనంగా ఆనందరావు.

"అపర భస్మాసురల సంఘం" చెప్పాడు సీతారాం.

"అపర భస్మాసురుల సంఘం?" అన్నాడు ఆనందరావు.

మీరలా చెప్తే అయనకేం అర్థం అవుతుంది? వివరంగా చెప్పండి" అన్నాడు భజగోవిందం.

"అలాగేలేండి" అంటూ మొదలుపెట్టాడు సీతారాం.

'ఆనందరావుగారూ ఈ భజగోవిందంగారున్నారే ఆయనది భలే విచిత్ర జాతకం. ఎప్పుడూ ఏదో ఓ గ్రహం దుష్టస్థానంలో ఉంటూనే ఉంటాడు. యోగ దశలున్నాయట. ఆయా మిత్ర గ్రహాలు ఈయనికి యోగం కలిగిద్దామనుకుంటూ ఉండగానే ఆ గ్రహం తాలూకు శత్రుగ్రహం నీచస్థానంలో చేరి ఈ మిత్రగ్రహాన్ని వక్రదృష్టితో చూడడం ఆరంభిస్తాడుట. పాపం దాంతో ఆ మిత్రగ్రహం కూడా ఏమీ చెయ్యలేక చేతులెత్తేస్తాడుట. అందువల్ల ఈయనకు చేతిదాకా వచ్చిన అదృష్టం కూడా నోటికందదు.

నెలకు ఇంత అని కడితే సంవత్సరం చివరికి ఫలానా వస్తువులిస్తాం అనే పథకంలో చేరారు ఈయన. నెలనెలా డ్రాలో లాట్రీ తగల్లేదు సరికదా పదకొండు నెలల తర్వాత ఆ కంపెనీవాడు పారిపోయాడు.

ఈయనకి షేర్ల గురించి ఓనమాలు రావు. కానీ శ్రేయోభిలాషి ఒకడు షేర్లు కొని అమ్మితే లక్షలు సంపాదించవచ్చునని చెప్తే లక్ష రూపాయలు తెచ్చి షేర్లలో పెట్టాడు. మర్నాడు తెల్లారేసరికి హర్షద్ మెహతా మోసం బయటపడి షేరు మార్కెట్ శీర్షాసనం వేసింది. అంతటి ఘనుడు మా భజగోవిందగారు" సీతారాం ఆనందంగా చెపుతుంటే......

"పోదురూ మీరు మరీనూ ఊరికే ములగ చెట్టెక్కించేస్తున్నారు" అన్నాడు భజగోవిందం ముసిముసినవ్వులు చిందిస్తూ.

"ఇందులో అతిశయోక్తి ఏముందండీ. ఉన్న మాటేగా చెపుతున్నాను. అయినా మీ గురించి ఏం చెప్పేశాను గనుక ఇంకా ఆవగింజలో అరభాగం కాలేదు" అన్నాడు సీతారాం.

"సరేలెండి మీరు నన్ను పొగడడం మొదలుపెడితే ఇక ఆపరు. మరి మీ గురించి కూడా నాలుగు మాటలు చెప్పనివ్వండి'' అంటూ అందుకున్నాడు భజగోవిందం.

"ఆనందరావుగారూ! మన సీతారాంగారు భలే తమాషా మనిషి. ఎక్కువ వడ్డీకోసం ఆయన సొమ్ము వేసిన ఫైనాన్స్ కంపెనీలన్ని ఢామ్మని మునిగిపోతాయి. ఆయన లీలలు ఒకటీ రెండూ కాదు అపారం. అందరి కొడుకులూ అమెరికా

వెళ్తున్నారు. తన కొడుకూ వెళ్ళాలని తెగ సరదాపడిపోయారు. చాలా ప్రయత్నాలు చేశారు.

"చివరకెలాగైతేనేం.... అమెరికా ఛాన్స్ వచ్చింది. వీసా వగైరాలు వచ్చాయి. ఇక నాల్రోజుల్లో విమానం ఎక్కుతాడనగా బిన్ లాడెన్ డబ్ల్యు.టి.సి టవర్లు కాస్తా కూల్చేశాడు. దాంతో పిల్లవాడి ప్రయాణం ఆగిపోయింది" అన్నాడు భజగోవిందం మెచ్చుకోలుగా సీతారాం వంక చూస్తూ.

ఇదంతా వింటున్న ఆనందరావుకి అయోమయంగా అనిపించింది.

"మరి ఇన్ని విధాలుగా నష్టపోయి!" అడుగుతుండగానే అందుకున్నాడు భజగోవిందం.

"ఆ! సింగినాదం! జీలకర్ర! చూడండి ఆనందరావుగారూ. ఇంట్లో నేలమీదపడి మన కాలు విరిగిందనుకోండి. ఏడుపొస్తుంది.

ఆ తరువాత సిమెంట్ కట్టు కట్టించుకోవడానికి ఎముకల ఆస్పత్రికి వెళ్ళి మనలాంటి వాళ్ళని నలుగురిని చూసినప్పుడు ఆటోమెటిక్‌గా ధైర్యం వస్తుంది.

ఇదీ అంతే మాకు నష్టాలు వచ్చినప్పుడు పరిహారం కోసం అక్కడికీ ఇక్కడికీ తిరుగుతూ ఉంటే మాలాంటివాళ్లే చాలామంది పరిచయం అయ్యారు. ఎవరి బాధలు వారివి.. ఎదుటివారితో పంచుకుంటే అదో రిలీఫ్.

అందుకే నాకో ఆలోచన వచ్చింది. దీనికి సీతారాంగారి ప్రోత్సాహం లభించింది. "అపర భస్మాసురల సంఘం" అని ఒక సంస్థను ప్రారంభించాం. ముందు పట్టుమని పదిమంది సభ్యులతో ప్రారంభమైన మా సంస్థకు మంచి స్పందన లభించింది. ఈనాడు మాకు వేలమంది సభ్యులున్నారు.

నెలకు రెండుసార్లు మా మీటింగ్స్ ఉంటాయి అందరం ఓ చోట చేరతాం. ఎవరి అనుభవాలు వారు చెప్తారు. భలే సరదాగా ఉంటుంది. త్వరలో ప్రథమ వార్షికోత్సవం జరుపుకోబోతున్నాం. మా దగ్గర ఫండ్స్ బాగానే వున్నాయి. అందుకే వార్షికోత్సవం గ్రాండ్‌గా జరపాలని ప్లాన్ చేస్తున్నారు మా సెక్రటరీగారు" అన్నాడు. వీలైనంత వివరంగా చెప్తూ.

"అవునండీ మామూలుగా ఉండే ఆటలపోటీలు, పాటలపోటీలు కాకుండా వైవిధ్యంగా ఉండాలని ఓ పోటీ ఏర్పాటు చేశాం. సభ్యులంతా తమ తమ అనుభవాలను

రాసి పంపాలి. వాటిని మేము పరిశీలించి ఉత్తమోత్తను భస్మాసుర, ఉత్తమ భస్మాసుర, మాములు భస్మాసుర అని మూడు అవార్డులు ఇవ్వాలనుకున్నాం" చెప్పాడు సీతారాం.

"ఆ పనిమీదనే వచ్చారు సీతారాంగారు" అని ఆనందరావుతో చెప్పి ఎలా ఉందండీ రెస్పాన్స్?" అని అడిగాడు భజగోవిందం.

"ట్రెమండస్ రెస్పాన్స్. వందమంది తమ అనుభవాలను రాసి పంపారు. మన కమిటీ అంతా కూర్చుని అన్నీ చదివారు.

చాలావరకూ, మునిగిపోయిన చిట్‌ఫండ్ కంపెనీ బాధితులూ, మూతపడ్డ బ్యాంకు ఖాతాదారులూ, టేకుచెట్లకు బలైపోయినవాళ్లు, శ్రీగంధం తోటలతో బొప్పికట్టినవాళ్ళూ, అప్పులిచ్చి చెప్పుదెబ్బలు తిన్నవాళ్ళూ చదివి చదివి బోర్‌కొట్టేసింది. వెరైటీగా ఉండే కేసులకి అవార్డులిస్తే బావుంటుందని అందరూ అనుకున్నారు" అన్నాడు సీతారాం.

"అవునవును అలా ఇస్తే బావుంటుంది. వాళ్లని ఎంకరేజ్ చేసినట్లు ఉంటుంది" అన్నాడు భజ గోవిందం.

"అలాటివి మూడు ఎంచి తీసుకొచ్చాను. మీరు చదివి ఫస్ట్ సెకండ్ థర్డ్ డిసైడ్ చేద్దాం!" అన్నాడు సీతారాం.

"అలాగే సమయానికి మన ఆనందరావు కూడా ఉన్నారు. మన అ.భ.సం.కు చెందని వారు కాబట్టి నిష్పక్షపాతవైఖరితో వ్యవహరిస్తారు" అన్నాడు భజగోవిందం.

అందులో ఒక అప్లికేషన్ తీసి చదవనారంభించాడు సీతారాం.

గౌరవనీయులైన కార్యదర్శిగారికి!

మీరు ప్రకటించిన పోటీకిగాను నా అనుభవాల్ని రాసి పంపుతున్నాను. రూపాయితో వచ్చి కోట్లు గడించిన వారి విజయగాథలు అందరూ వినే ఉంటారు. నాది అందుకు విరుద్ధంగా యాభై లక్షలను రెండు సంవత్సరాల్లో యాభై రూపాయలుగా మార్చిన వీరగాథ.

నాకు పిత్రార్జితంగా యాభై లక్షల విలువగల భూమి రూపంలో వచ్చినది. నాకు సంతానం లేదు. కొన్ని తీవ్రవాద ముఠాలు నావంటి వారి ఆస్తిని బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నారని విని భయపడి ఆ భూమి అంతా అమ్మి సిటీకి వచ్చాను.

సిటీలో ఫాస్ట్‌ఫుడ్ సెంటరు ప్రారంభించాను. ఇండియన్ వంటకాలే కాకుండా చైనీస్, ఇటాలియన్, మెక్సికన్... ఇత్యాది వంటకాలన్నీ వండించాను. నా హోటల్‌కి

మంచి పేరు వచ్చిందో లేదో మునిసిపాల్టీవాళ్ళు రోడ్డు వెడల్పు చేసే కార్యక్రమంలో బుల్డోజరుతో వచ్చి నా హోటలును పడగొట్టేశారు.

వారిచ్చిన నష్టపరిహారం, హోటలు ఫర్నిచరు అమ్మగా వచ్చిన ఇరవై లక్షలు సగం బ్యాంకులోనూ, సగం ఎక్కువ వడ్డీ ఇచ్చే ఫైనాన్సు కంపెనీలోనూ పెట్టాను. ఆర్నెల్లు వడ్డీ పుచ్చుకున్నాను. ఫైనాన్సు కంపెనీ మూతపడింది. ఎందుకైనా మంచిదని బ్యాంకులో దాచిన డబ్బు కూడా తీసేసి గవర్నమెంటు బ్యాంకులో వేశాను.

ఒకరోజు తలనొప్పిగా ఉందని పక్కింటి డాక్టరు దగ్గరికి వెళ్తే ఆయన నన్ను ఆఘమేఘాల మీద కార్పొరేట్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళాడు. వాళ్ళు నన్ను ఐ.సి.సి.యు.లో పెట్టి పరీక్షలన్నీ చేశారు. యాంజియో చేసి, బెలూన్ వదిలి ఆఖరుగా బైపాస్ సర్జరీ కూడా చేసేశారు. నాకేమో వొంటిమీద తెలివి లేదు. నా భార్యకి కంగారు. ఆ తరవాత మాకు తెలిసిన డాక్టరు హాస్పిటల్‌కి వచ్చాడు నన్ను చూడ్డానికి.

పేస్‌మేకరు పెట్టి, ఓపెన్ హార్టు సర్జరీ కూడా చేసేస్తాం... అని సరదా పడుతున్న హాస్పిటల్ వాళ్లతో దెబ్బలాడి నన్ను విడుదల చేయించాడు. మూడు లక్షలు సమర్పించుకుని బయటపడ్డాం.

"ఇక సిటీలో బతకలేం అనుకుని మా ఊరికి వెళ్లాం. వ్యవసాయం చేద్దాం అని పొలం కౌలుకి తీసుకుని పత్తి వేశాను. పురుగులబారిన పడి పంట నాశనం అయింది. తరువాత వేరుసెనగ వేశాను. వర్షాలు పడక పంట ఎండిపోయింది. అప్పులు తీర్చగా నా చేతిలో యాభై రూపాయలున్నాయి.

నా ఈ కథ బహుళ ప్రచారం పొందేలా చూడవలసిందని వేడుకుంటున్నాను." చదవటం ముగించాడు సీతారాం.

"బావుంది మంచి వెయిట్ ఉన్న ఎంట్రీ!" మెచ్చుకున్నాడు భజగోవిందం.

"అందుకేగా మరి ఆఖరిదాకా నిలబడగలిగింది" అంటూ మరో కాయితం అందుకున్నాడు సీతారాం.

చదవటం మొదలుపెట్టాడు.

"పెద్దలకు నమస్కారం! నాదో వింత అనుభవం. మా ఇల్లు రోడ్డు పక్కనే ఉంది. ప్రభుత్వం వారు రోడ్డు పక్కనే నాటిన చెట్టుకొమ్మలు రెండు మా ఇంటి మీదికి పాకి ఉన్నాయి. టి.వి.కేబుల్ వైర్లకు, టెలిఫోన్ వైర్లకు అడ్డం వస్తున్నాయనీ,

డాబా మీదికి సరిగా ఎండ రావటంలేదనీ మా ఇంట్లో వాళ్లు గొడవ పెట్టడంతో రెండు పెద్ద కొమ్మలు కొట్టించాను. చుట్టుపక్కల పని పాటలు చేసుకునే జనం వచ్చి ఆ కొమ్మలు కొట్టుకుపోయారు.

“అలా గవర్నమెంటు వారి చెట్లు నరకడం నేరమట. నన్ను పట్టుకుపోయి ఓ పూటంతా లాకప్‌లో ఉంచి బెయిల్ మీద వదిలిపెట్టారు. వారం వారం స్టేషనుకి వెళ్ళి సంతకం పెట్టిరావాలి. పోలీసులు మా ఇంటికి దర్జాగా రాకపోకలు మొదలుపెట్టారు. ఎప్పుడో తాతల కాలం నాడు చేయించిన కర్ర ఫర్నీచరు మొత్తం పట్టుకుపోయారు. ఇదేమిటంటే అసలే నీకు కలప దొంగ తనం చెయ్యటం అలవాటు. ఇవన్నీ కూడా దొంగ కలపతో చేయించినవే అని మా అనుమానం అన్నారు.

“ఇదిలా ఉండగా ఓ కొత్త ఇన్‌స్పెక్టరు వచ్చాడు. నీకూ వీరప్పన్‌కి ఏమైనా సంబంధం వుందా అని అడిగాడు. ఆయన చాదస్తం కాక పోతే చందనం స్మగ్లర్ ఆయనెక్కడ? ఇంటి మీదికి పాకిన అడవి చెట్టు కొమ్మలు కొట్టిన బక్క పీనుగని నేనెక్కడ? ఏది ఏమైనా ఈ సంఘటన తరవాత నా గ్లామరు పెరిగింది. మా పేటలోని వాళ్లంతా నన్ను గౌరవంగా చూస్తున్నారు. నన్ను చందాలు అడగడానికి భయపడుతున్నారు. కాకపోతే అయిన వాళ్లందరూ నీకిదేం పోయే కాలం అని చీదరించుకుంటున్నారు.

“విన్నారుగా నా కథ. మీరు ప్రకటించిన అవార్డు నాకే రావాలని కోరుకుంటున్నాను” అని ముగించాడు సీతారాం.

“ఇదీ బావుందండోయ్!” అనందపడ్డాడు భజగోవిందం.

“మరి ముచ్చటగా మూడోది కూడా వినండి” అన్నాడు సీతారాం ఆ పేపరు తీసి.

“ఆర్యా!

“నా పేరు రామచంద్రమూర్తి. ఆ దేవుడి పేరు పెట్టుకొన్నందుకో ఏమో నాకన్నీ గడ్డు సమస్యలే. నా కుమారుని చదువు పూర్తి అయిన పిమ్మట ఇచ్చట ఉద్యోగం లభించని కారణమున రెండు లక్షల రూపాయలు అప్పు తెచ్చి ఏజెంటు ద్వారా అమెరికా పంపించినాను. అచ్చట ఆరు మాసములు వీడిని బెంచి మీద కూర్చోబెట్టి ఆ తరవాత బెంచి మీద కూర్చొనుటకు మరికొందరు వచ్చినారు. నీకు ఖాళీ లేదు అని ఇండియాకు పంపేసినారు.

"ఉద్యోగము చేయకపోయినను అంతకాలము అమెరికాలో ఉండుట వలన వాడికి అన్నీ అమెరికన్ షోకులే అలవడినవి. పిజ్జాలు, బర్గర్లు, ఐస్క్రీములూ తప్ప మామూలు ఆహారములు స్వీకరించడు. ఎనిమిది జేబులున్న జీన్స్ ప్యాంట్లు తప్ప మామూలు జేబులున్న జీన్స్ ప్యాంట్లు ధరించడు. నాలుగొందల వాట్లకు తక్కువ స్థాయిలో మ్యూజిక్ వినడు. మాకేగాదు, చుట్టుపక్కల వారికి కూడా న్యూసెన్స్‌గా తయారయినాడు.

"పోనీ ఏదోవిధముగా వీడికి వివాహము చేసినచో సగము ఖర్చునైనను మామగారు భరించెదరు కదా అని ఆశపడితే వీడికి ఐశ్వర్యారాయి కావాలిట. అందరు తండ్రులూ కొడుకులు అమెరికా నుంచి పంపిన డాలర్లు ఖర్చుపెట్టుకొనుచూ, ఆనందముగా ఉండగా నేను నా కొడుకు కోసం రూపాయలను డాలర్లుగా మార్చుచూ అఘోరించుచున్నాను. వీడికి హీనపక్షం రోజుకు అయిదు డాలర్లు ఖర్చుకు కావాలి.

"నా పరిస్థితిని అర్థం చేసుకుని ఆ అవార్డు నాకే ఇప్పించినచో నాకు కాస్త వెసులుబాటుగా ఉండును." అంటూ మూడో ఎంట్రీ ముగించాడు సీతారాం.

"ఇది మరీ బావుంది. జడ్జిమెంట్ కష్టమే" అన్నాడు భజగోవిందం తలపట్టుకుని. ఇద్దరూ కాసేపు ఆలోచించారు. తేలలేదు.

"పోనీ ఓ పని చేద్దాం. ఆనందరావుగారి స్థలం చూడాలి కదా! అలా వెళ్లొచ్చి ఫ్రెష్‌గా ఆలోచిద్దాం!" అన్నాడు భజగోవిందం.

"అవును ఆ పనిచేద్దాం. స్థలం చూసేసి మీరు నేను కాస్త అడ్వాన్స్ ఇచ్చేద్దాం. ఆ తరవాత అంటారా నందోరాజా భవిష్యతి, ఏమంటారు ఆనందరావుగారూ!" అంటూ ఆనందరావువైపు చూశాడు సీతారాం.

అప్పటికే సుఖసంతోషా వారిచ్చిన లెదర్ బ్యాగ్ చంకలో పెట్టుకుని రేసుగుర్రంలా పారిపోతున్నాడు ఆనందరావు. అతని ఏకైక ఆశయం ఒక్కటే. ఈ అపర భస్మాసురుల బారి నుంచి బయటపడాలి.

*ఈనాడు ఆదివారం, 22 జూన్ 2003*